సాక్షి
కాకినాడ
ఆదివారం । 21 । జనవరి । 2024



రూ.లక్ష విరాళం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి అంతరాలయం, మహా మండప నిర్మాణానికి బోడపాటి శ్రీను, వాణి దంపతులు (పాలకొల్లు) రూ.లక్ష విరాళం సమర్పించారు.



వెండి శఠగోపం సమర్పణ

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న దత్తాత్రేయ స్వామికి పూర్వపు కాకినాడ ఆర్డీఓ ఎన్వీవీ సత్యనారాయణ శనివారం 470 గ్రాముల బరువైన వెండి శఠగోపం సమర్పించారు.

డెల్టాలకు 10,450 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శనివారం 10,450 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.15 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

భారవికి వేటూరి పురస్కారం

29న ప్రదానం



తుని: తెలుగు సినీ రచయిత, దర్శకుడు జేకే భారవిని వేటూరి పురస్కారానికి ఎంపిక చేశామని వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కలగా రామజోగేశ్వరశర్మ శనివారం తెలిపారు. ఇప్పటి వరకూ 12 మంది సినీ, సాహితీ రంగ ప్రముఖులకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశామన్నారు. తుని చిట్టూరి మెట్రోలో ఈ నెల 29న భారవికి వేటూరి పురస్కారం ప్రదానం చేయనున్నామని శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు విజయ్ ప్రకాష్ తెలిపారు.

రూ.2.85 లక్షల సరకు జప్తు

కాకినాడ సిటీ: జిల్లాలో నిత్యావసరాల చట్టం –1955 సెక్షన్ 6ఏ కింద నమోదైన 7 కేసులపై జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ శనివారం విచారణ జరిపారు. ఈ కేసులలో సీజ్ చేసిన రూ.2,84,658 విలువైన సరకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఒక వాహన యజమానికి రూ.7 వేలు, అక్రమాలకు పాల్పడిన ఇద్దరు ఎరువుల దుకాణాల యజమానులకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ మొత్తాలను సివిల్ సప్లయిస్ ఖాతాకు జమ చేయాలని ఆదేశించారు. నిత్యావసరాల చట్టం ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ ఇలక్కియ హెచ్చరించారు.

ఈవీఎం గోదాము భద్రతకు చర్యలు

కాకినాడ సిటీ: కలెక్టరేట్ వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం), వీవీ ప్యాట్ గోదామును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా శనివారం తనిఖీ చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల భద్రతకు తీసుకున్న చర్యలను రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెలా ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదిక పంపిస్తున్నామని చెప్పారు. అనంతరం కలెక్టరేట్‌లో ఓటరు ఫొటో గుర్తింపు కార్డుల (ఎపిక్) పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి, సకాలంలో నూరు శాతం కార్డుల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రేపు చిత్రలేఖన పోటీలు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగమణి తదితరులు

కాకినాడ సిటీ: చిత్తడి నేలల సంరక్షణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కార్ప్స్, పాఠశాల విద్య, అటవీ శాఖల ఆధ్వర్యాన సోమవారం చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యా శాఖ అధికారి జి నాగమణి ఈ విషయం తెలిపారు. చిత్తడి నేలల సంరక్షణపై ముద్రించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆవరణలో శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా సమన్వయకర్త కేవీకే మహేశ్వరరావు మాట్లాడుతూ, వివేకానంద పార్కు ఆవరణలోని గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి ఈ పోటీ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ, పిఠాపురం ఉప విద్యాశాఖాధికారులు జె.డేనియల్‌రాజు, దాట్ల సుభద్ర, ఎంఈఓలు సీహెచ్ రవి, పి.వుల్లయ్య, నేషనల్ గ్రీన్ కార్ప్స్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నోటుపాట్లు

- అన్నవరం దేవస్థానంలో వింత పరిస్థితి
- డిజిటల్ పేమెంట్లకు నో చాన్స్
- ఏ సేవకైనా నోట్లు ఇవ్వాల్సిందే..
- క్యాష్ కావాలన్నా కొండపై కానరాని ఏటీఎంలు
- సత్యదేవుని భక్తులకు తీవ్ర ఇబ్బందులు

అన్నవరం: ఒకప్పుడు ఎక్కడికి వెళ్లాలన్నా, ఏం కొనాలన్నా జేబు నిండా డబ్బుండాల్సిందే. కానీ ఇప్పుడలా కాదు.. ఫోనులో పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి డిజిటల్ పేమెంట్ యాప్‌లు ఉండి.. వాటికి అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో నగదు బ్యాలెన్స్ ఉంటే చాలు.. ఎక్కడికైనా వెళ్లి ఏదైనా కొనుగోలు చేయవచ్చు. లేదా బ్యాంకు డెబిట్/క్రెడిట్ కార్డు లేదా ఉన్నా చాలు.. ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రా చేసి అవసరానికి వినియోగించుకోవచ్చు.

ఇలా దేశమంతా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ.. డిజిటల్ పేమెంట్ల వైపు పరుగు తీస్తుంటే.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో మాత్రం విచిత్రమైన పరిస్థితి నెలకొంది. రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి వెళ్లిన భక్తుల వద్ద ఏటీఎం కార్డులున్నా.. వారి మొబైల్ ఫోన్లలో డిజిటల్ పేమెంట్ యాప్‌లు ఉన్నా ఏమీ ఉపయోగం లేదు. దేవస్థానంలో సత్యదేవుని వ్రతం, కల్యాణం వంటి సేవలకు టికెట్లు కొనాలన్నా, ప్రసాదం ప్యాకెట్ కొనుగోలు చేయాలన్నా, దేవస్థానం సత్రాల్లో రూములు కావాలన్నా.. ఇలా దేనికైనా నగదు చెల్లించాల్సిందే. ఇక్కడ డిజిటల్ పేమెంట్లకు సిబ్బంది 'నో' చెబుతున్నారు. 'క్యాష్ ప్లీజ్' అంటున్నారు. పోనీ నగదు విత్‌డ్రా చేద్దామని అనుకున్నా కొండపై ఏటీఎంలు కూడా అందుబాటులో లేవు. దీంతో ఇక్కడకు వచ్చిన భక్తులు 'నోటు' పాట్లు పడుతున్నారు. కొండ దిగువన ఉన్న ఏటీఎంల వద్దకు వెళ్లి, నగదు విత్‌డ్రా చేసుకుని, తిరిగి కొండ మీదకు రావాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. కారో, ద్విచక్ర వాహనమో ఉన్న వారికి ఫర్వాలేదు. అవి లేని వారు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆటోలకు రూ.200 వరకూ చెల్లించుకుని కొండ కింద ఉన్న ఏటీఎంల వద్దకు వెళ్తున్నారు.

షాపుల్లో బతిమాలుకుంటూ..

అంతటా డిజిటల్ పేమెంట్లు సర్వసాధారణమైన ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ పేమెంట్లు చేయవచ్చనే ఉద్దేశంతో భక్తులు తక్కువ నగదుతో రత్నగిరికి వస్తున్నారు. తీరా ఇక్కడకు వచ్చాక దేవస్థానం నిర్వహించే ప్రతి కౌంటర్‌లో నగదు చెల్లించాల్సిన పరిస్థితి ఎదురవుతూండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో దేవస్థానంలోని షాపులు, ప్రైవేటు క్యాంటీన్ నిర్వాహకులు మాత్రం డిజిటల్ పేమెంట్లకు అంగీకరిస్తున్నారు. దీంతో 'నగదు ఇవ్వండి. మీకు ఫోన్ పే చేస్తాం' అంటూ వారిని భక్తులు బతిమాలుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పైగా, ఒకరికో ఇద్దరికో క్యాష్ ఇవ్వగలం కానీ, వచ్చిన భక్తులందరికీ తాము ఎలా నగదు సర్దుబాటు చేయగలమని వ్యాపారులు అంటున్నారు.

సిబ్బందికీ ఇబ్బందే..

సత్యదేవుని సన్నిధికి ప్రతి రోజూ సుమారు 10 వేల నుంచి 50 వేల మంది భక్తులు వస్తారు. విశేష పర్వదినాల్లో ఈ సంఖ్య లక్ష దాటుతుంది కూడా. భక్తుల ద్వారా దేవస్థానానికి ప్రతి రోజూ రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు, పర్వదినాల్లో రూ.కోటి వరకూ ఆదాయం వస్తోంది. అంతటా నగదు వ్యవహారాలే ఉండటంతో, ఆ నోట్ల లెక్కింపులో సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు.

మూడు ఏటీఎంలలో రెండు తొలగింపు

గతంలో రత్నగిరిపై సత్యదేవ అతిథి గృహం (30 వీఐపీ సత్రం) వద్ద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎం ఉండేది. అలాగే, ఈఓ కార్యాలయం ఎదురుగా పార్కింగ్ స్థలంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో, అన్నదాన భవనం పై భాగంలో యూనియన్ బ్యాంక్ (ఆంధ్రా బ్యాంక్) ఏటీఎంలు ఉండేవి. అయితే నాలుగు నెలల కిందట 30 వీఐపీ సత్రాన్ని, ఈఓ కార్యాలయం ఎదురుగా పార్కింగ్ స్థలంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చేశారు. ఆ సమయంలో వాటిలోని ఏటీఎంలను అక్కడి నుంచి తరలించారే తప్ప కొండపై ఎక్కడా ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రస్తుతం అన్నదాన భవనం మీద ఉన్న ఏటీఎం మాత్రమే భక్తులకు దిక్కవుతోంది. ఒకే ఒక్క ఏటీఎం కావడంతో.. నగదు డిపాజిట్ చేసిన గంటలోనే భక్తులు విత్‌డ్రా చేస్తుండడంతో అది కూడా ఖాళీ అయిపోతోంది.

ఈ పరిస్థితుల్లో దేవస్థానంలో వెంటనే డిజిటల్ పేమెంట్లకు అవకాశం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. ప్రత్యేకంగా పశ్చిమ రాజగోపురం, రామాలయం వద్ద సన్నిధి బుకింగ్ కౌంటర్‌లో డిజిటల్ పేమెంట్లకు ఏర్పాటు చేయాలని, దేవస్థానంలో తొలగించిన రెండు ఏటీఎంలను కొండపై మరోచోట వెంటనే ఏర్పాటు చేయాలని, వాటిలో తగినంత నగదు నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్నవరం దేవస్థానం





నోట్ల కష్టాలు తీర్చు స్వామీ!

స్థలమిస్తే వారంలోగానే ఏటీఎం



రత్నగిరిపై స్టేట్ బ్యాంక్ ఏటీఎం ఏర్పాటు చేయాలని చాలా మంది భక్తులు కోరుతున్నారు. 30 వీఐపీ సత్రాన్ని కూల్చివేసిన తరువాత అక్కడ ఉండే ఎస్‌బీఐ ఏటీఎంను మరోచోట ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని దేవస్థానం అధికారులను కోరుతున్నాం. పశ్చిమ రాజగోపురం ఎదురుగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకటి ఏటీఎంకు కేటాయిస్తామని ప్రస్తుత ఈఓ రామచంద్ర మోహన్ చెప్పారు. మాకు చిన్న రూము కేటాయిస్తే చాలు.. వారం రోజుల్లో ఏటీఎం ఏర్పాటు చేస్తాం.

– రఘురామ్, బ్రాంచి మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అన్నవరం

త్వరలోనే పరిష్కరిస్తాం



అన్నవరం దేవస్థానంలో డిజిటల్ పేమెంట్లకు, బ్యాంకు కార్డుల ద్వారా నగదు చెల్లింపునకు అవకాశం లేక చాలా మంది భక్తులు ఇబ్బంది పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. దీంతో బ్యాంకు కార్డుల ద్వారా నగదు చెల్లింపునకు వీలుగా సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేశాం. త్వరలోనే స్వైపింగ్ మెషీన్లు ఏర్పాటు చేస్తాం. అలాగే, స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంకు ఏటీఎంలు ఏర్పాటు చేయిస్తాం.

– కె.రామచంద్ర మోహన్, అడిషనల్ కమిషనర్, ఈఓ, అన్నవరం దేవస్థానం

రత్నగిరిపై భక్తుల రద్దీ



తిరుచ్చి వాహనంపై సాగుతున్న సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు

అన్నవరం: రత్నగిరికి శనివారం కూడా భక్తులు పోటెత్తారు. పుష్య శుద్ధ దశమి పర్వదినం కావడంతో వేలాదిగా భక్తులు తెల్లవారుజాము నుంచే సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. దర్శనం క్యూ లైన్లు, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో నిండిపోయాయి. సుమారు 30 వేల మంది సత్యదేవుని దర్శించుకున్నారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. రెండు వేల వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

ఘనంగా ప్రాకారసేవ

సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై వేంచేయించి, తూర్పు రాజగోపురం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం తిరుచ్చి వాహనంపై మూడుసార్లు ప్రదక్షిణ చేయించారు. తిరిగి పూజలు చేసి, స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి చేర్చారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ కృష్ణారావు, సూపరింటెండెంట్ పి.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

పుష్య శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం ఏడు గంటలకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన, ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ సహస్ర కుంకుమార్చన నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి ప్రసాదాలు నివేదించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శృంగార వల్లభుని సన్నిధిలో భక్తుల రద్దీ



విశేషాలంకారంలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తిరుపతి గ్రామంలో వేంచేసిన స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుగంధభరిత పూలమాలలతో స్వామివారిని అర్చకులు విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. వారికి ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. దర్శనం, అన్నదానం, కేశఖండన టికెట్ల ద్వారా స్వామి వారికి రూ.3,06,284 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశారు.



స్వామి వారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలి



రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్ కుమార్

- హెల్మెట్, సీటు బెల్టు ధరించాలి
- కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రహదారి భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా వచ్చే నెల 19వ తేదీ వరకూ ప్రజలకు అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. హెల్మెట్ ధరించనందువలన ద్విచక్ర వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. దీనిని నివారించేందుకు ద్విచక్ర వాహనం నడుపుతున్న వారితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే, కార్లలో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. స్కూల్ పిల్లలను తీసుకుని వెళ్లే చాలా ఆటోలను అధిక లోడుతో నడుపుతున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కూల్ పిల్లలను తీసుకుని వెళ్లే ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపే డ్రైవర్లపై రవాణా శాఖ అధికారుల సహకారంతో, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోడ్డు ప్రమాదాలపై యువతకు అవగాహన కల్పిస్తూ, రహదారి భద్రత, నిబంధనలు సక్రమంగా పాటించేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎ.మోహన్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పాఠశాలలు, కాలేజీల విద్యార్థులకు, లారీ యూనియన్ కార్యాలయాల్లో డ్రైవర్లకు, స్కూల్, కాలేజీ విద్యార్థులను తీసుకువెళ్లే డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వివరించారు. అనంతరం రోడ్డు భద్రత మాసోత్సవాల కరపత్రాలను, పోస్టర్లను, కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్ కుమార్, ఇతర అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ హరిప్రసాద్, జిల్లా ప్రధాన రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంపీఎం మనోహర్, డీటీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.రామచంద్రరావు, ఆర్టీఓ పీవీ సాయిప్రసాద్, మోటార్ వాహన తనిఖీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అనధికార సైరన్లకు బ్రేక్

- దుర్వినియోగంపై అధికారులు సీరియస్
- వాహనం సీజ్‌తో పాటు పర్మిట్లు రద్దు
- స్పెషల్ డ్రైవ్‌కు రవాణా శాఖ సన్నద్ధం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రోడ్లపై సైరన్లు మోగించుకుంటూ రయ్ రయ్యిన కొన్ని వాహనాలు దూసుకుపోతుంటాయి. ఆ వాహనాలు ఏ వీవీఐపీలవో, మంత్రులవో అనుకుని ముందు వెళ్లే వాహన చోదకులు పక్కకు తప్పుకుంటారు. కానీ అనధికారికంగా సైరన్లు ఏర్పాటు చేసుకున్నవి కూడా ఉంటున్నాయి. ఎక్కడైనా సైరన్ మోగించుకుంటే వెళ్తున్న ఇలాంటి అనధికార వాహనాలను రవాణా శాఖ అధికారులు ఆపడానికి ప్రయత్నాలు చేస్తున్నా ఆపకుండా మరింత వేగంగా దూసుకుపోతున్నారు. అంతే కాదు.. టోల్‌ప్లాజాల సిబ్బంది కూడా వీవీఐపీ వాహనాలుగా భావించి పంపించేస్తున్నారు. ఇలాంటివి గతంలో నామమాత్రంగా ఉండేవి. ఇప్పుడవి లెక్కకు మిక్కిలిగా ఉంటున్నాయి. ఈ తరహా వాహనాలు రోజు రోజుకూ అధికమవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన రవాణా శాఖ అధికారులు అనధికార సైరన్ వినియోగిస్తున్న వాహనాలపై కొరడా ఝుళిపించడానికి సన్నద్ధమవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై సైరన్లతో తిరిగే వాహనాలను పట్టుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ అనధికార సైరన్ ఉన్న వాహనాలను సీజ్ చేయనున్నారు. అంతే కాదు.. సంబంధిత వాహనం డ్రైవర్, యజమాని డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఆ వాహనం పర్మిట్‌కూడా తాత్కాలికంగా క్యాన్సిల్ చేస్తామని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తమ వాహనాలకు అనధికారికంగా ఏర్పాటుచేసిన సైరన్లు తక్షణం తొలగించుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

సైరన్ అనుమతుల పరిశీలన..

సైరన్‌లతో వెళ్లే వాహనాల నంబర్లు ముందుగా తీసుకుంటారు. ఆ వాహనానికి సైరన్ అనుమతి ఉందో లేదో రికార్డులు పరిశీలిస్తారు. లేని పక్షంలో కేసు నమోదు చేస్తారు. అలాగే రవాణా శాఖ తనిఖీ సమయంలో తప్పించుకుని పోయే ప్రయత్నాలు చేస్తే పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసి, కేసులు నమోదు చేయనున్నారు.

ఈ వాహనాలకు సైరన్ ఓకే..

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు, గవర్నర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీల కాన్వాయ్, ఇతర ముఖ్య నాయకుల భద్రతా కాన్వాయ్, న్యాయమూర్తులు, పోలీసు ఉన్నత అధికారులు, మోటార్ వెహికల్ శాఖ ఉన్నతాధికారులు విధి నిర్వహణలో వెళ్లే వాహనాలకు ఈ సైరన్ అనుమతిస్తారు.



వాహనంపై సైరన్‌ను తొలగిస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లాలో వాహనాల సంఖ్య

మోటార్ కార్లు	38,855
మ్యాక్సీ క్యాబ్	549
మోటార్ క్యాబ్	1,185
అంబులెన్సులు	80

సైరన్లకు అనుమతి ఉండాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు హోదా కలిగిన అధికారిక వాహనాలకు మాత్రమే సైరన్ ఉండాలి. ఇవీ అత్యవసరం అయితే తప్ప ఇష్టానుసారం వినియోగించరాదు. అనధికార సైరన్ల వినియోగంపై డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకుంటున్నాము.

– ఎ.మోహన్, జిల్లా రవాణా శాఖ అధికారి, కాకినాడ

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి మృతి


రమేష్ (ఫైల్)

కిర్లంపూడి: పురుగు మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందినట్లు కిర్లంపూడి పోలీస్ స్టేషన్ ఏఎస్సై బీఎస్‌వీఎస్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గెద్దనా పల్లి గ్రామానికి చెందిన గుడ రమేష్ (38) జగపతినగరంలోని ప్రగతి ప్రైవేట్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వస్తూ గెద్దనాపల్లి మార్గం మధ్యలో పొలాల వద్ద పురుగు మందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు ప్రత్తిపాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య భవాని, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తండ్రి గుడ అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

దేశం మెచ్చే క్రీడాకారులుగా ఎదగాలి

- కలెక్టర్ కృతికా శుక్లా
- అండర్–19 జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం


టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కలెక్టర్ కృతికా శుక్లా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అవకాశాలను అందిపుచ్చుకుని దేశం మెచ్చే క్రీడాకారులుగా ఎదగాలని కలెక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా శాఖ సహకారంతో జిల్లా విద్యా శాఖ, పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన 67వ జాతీయ స్థాయి అండర్–19 పురుషుల లాన్ టెన్నిస్ పోటీలు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. దీనికి రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి భానుమూర్తి రాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కలెక్టర్ కృతికా శుక్లా, ఏఎస్పీ సత్యనారాయణ, కాకినాడ ఆర్జేడీ నాగమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించి తమ రాష్ట్రాలకు మంచి పేరు తేవాలని అన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ క్రీడలతో స్నేహ బంధాలు బలపడతాయన్నారు. క్రీడా స్ఫూర్తితో అంతా రాణించాలన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు మాట్లాడుతూ శనివారం నుంచి 24 వరకూ జరిగే పోటీల్లో 23 రాష్ట్రాల నుంచి 119 మంది క్రీడాకారులు, 46 మంది క్రీడాధికారులు, 100 మంది లోకల్ అఫీషియల్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని కలెక్టర్, పాఠశాల క్రీడా సమాఖ్య పతాకాన్ని కర్రి పద్మశ్రీ, జిల్లా ఎస్‌జీఎఫ్ఐ పతాకాన్ని కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారుల కవాతును వారు తిలకించారు. పోటీల ప్రారంభ సూచికంగా బెలూన్లు, శాంతి కపోతాలను గాలిలోకి వదిలారు. క్రీడా జ్యోతిని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ వెలిగించారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు క్రీడా ప్రతిజ్ఞ చేశారు. 77 ఏళ్ల వయసులో అంతర్జాతీయ టెన్నిస్ పోటీలకు హాజరవుతున్న పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, ఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో పాల్గొన్నందుకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఏఎస్పీ సత్యనారాయణలను పాఠశాల క్రీడా సమాఖ్య తరఫున కలెక్టర్ దుశ్శాలువాతో సత్కరించారు. కలెక్టర్ కృతికా శుక్లాను భానుమూర్తి రాజు, ఆర్జేడీ నాగమణి, పోటీల నిర్వహణ కార్యదర్శి ప్రసాద్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్‌లు సన్మానించారు. మున్సిపల్, జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. గుడిమెల్లంక విద్యార్థుల విన్యాసాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో టోర్నమెంట్ జాతీయ పరిశీలకులు తెలంగాణ నుంచి రామిరెడ్డి, ఒలింపిక్ సంఘ చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి, ఉప విద్యాశాఖ అధికారులు డానియేల్ రాజు, సుభద్ర, అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్, ఎంఈఓలు వాణికుమారి, రవి, గణేష్‌బాబు, ఏసుదాసు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, వై.బంగార్రాజు, రంగారావు, పట్టాభి, పీడీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాట్ పట్టి.. కూత పెట్టి

- 'నన్నయ'లో ఏపీ ఈపీడీసీఎల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యుత్తు ఉద్యోగులు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం/ రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగ బాధ్యతల్లో బిజీగా గడిపే వారంతా ఒక్కసారిగా బ్యాట్ పట్టారు.. కబడ్డీ కబడ్డీ అంటూ కూత పెట్టారు.. క్యారం బోర్డుపై ఎత్తుకు పైఎత్తులు వేశారు.. వాలీబాల్ ఆటలో చెలరేగిపోయారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఈపీడీసీఎల్ 9వ ఇంటర్ డివిజన్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో విద్యుత్తు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీనికి రాజానగరం మండలం వెలుగుబందలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికైంది. శనివారం ఈ స్పోర్ట్స్ మీట్‌ను యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రారంభించారు. తొలుత కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడికి గురయ్యే విద్యుత్ శాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడలతో శరీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం పొందవచ్చన్నారు. అంతేకాకుండా పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి తోడ్పడతాయన్నారు. ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ రెండు రోజులపాటు వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, క్యారం బోర్డ్, చెస్ వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ డివిజన్లు, రంపచోడవరం, రామచంద్రపురం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట డివిజన్లు, రాజమహేంద్రవరం సర్కిల్ ఆఫీస్ ఎంఆర్టీ డివిజన్లకు చెందిన ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను రాజమహేంద్రవరం గెయిల్ ఆఫీస్ సమీపంలోని బ్యాడ్మింటన్ కోర్టులో, క్రికెట్ పోటీలను కాకినాడ సమీపంలోని రామేశ్వరంలో నిర్వహిస్తున్నామన్నారు. మహిళలకు క్రీడా పోటీలు 22న రాజమహేంద్రవరం ఎస్ఈ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం విద్యుత్తు శాఖ ఈఈ నక్కపల్లి శామ్యూల్, రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ, ఎస్ఏఓ కె.ఆదినారాయణమూర్తి, విద్యుత్ శాఖ సబ్ డివిజన్ల అధికారులు, యూనివర్సిటీ పీఈటీలు పాల్గొన్నారు.

'సలాది కృష్ణ'కు అంతర్జాతీయ అవార్డులు


సలాది కృష్ణ, ఫొటోగ్రాఫర్


అవార్డులు పొందిన 'స్పీడ్ డ్యాన్స్' ఫొటో

ప్రత్తిపాడు: ప్రత్తిపాడుకు చెందిన ఫొటోగ్రాఫర్ సలాది కృష్ణకు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫొటోగ్రఫీ ప్రదర్శనల్లో మూడు అవార్డులు, ఆరు మెరిట్ సర్టిఫికెట్లు లభించాయి. ఈ మేరకు ఆయా నిర్వాహకుల నుంచి అవార్డులు, ప్రశంసాపత్రాలు అందాయి. 2023 అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ (ఐఐపీసీ) న్యూఢిల్లీ, బెంగళూరు, ఇండోర్‌లలో నేషనల్ డిజిటల్ సర్క్యూట్ నిర్వహించిన అంతర్జాతీయ ప్రదర్శనల్లో కలర్ ఛాయా చిత్ర (పీఐడీ కలర్) విభాగంలో కృష్ణ ఫొటో 'స్పీడ్ డ్యాన్స్'కు అవార్డులు లభించాయి. వీటితో పాటు న్యూఢిల్లీ ఛాయా చిత్ర ప్రదర్శనలో కలర్స్ విభాగంలో 'జ్యూయెల్ బగ్స్'కు, బెంగళూరులో 'డైలీ వాజ్'కు, గౌహతిలో 'బ్యూటీ ఆఫ్ హెయిర్', 'స్పీడ్ డ్యాన్స్'కు, విజయవాడ ఫొటో ప్రదర్శనలో 'బ్రిక్ మేకింగ్'లకు వెరసి ఆరు చిత్రాలకు మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్నారు. 2016 నుంచి అంతర్జాతీయ స్థాయి ఛాయా చిత్ర ప్రదర్శల్లో ఆయనకు అవార్డులు, ప్రశంసలు వస్తూనే ఉన్నాయి. కాకినాడకు చెందిన తుమ్మలపల్లి వీరభద్రరావు ప్రోత్సాహంతోనే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఫొటోలు పంపిస్తున్నట్లు కృష్ణ చెప్పారు. ఆయన్ని శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గ ఫొటోగ్రాఫర్ల సంఘ నాయకులు చిక్కాల సురేష్, నామన భాస్కర్, చవల శ్రీను, కొమ్ముల ఆనంద్, ఎస్ఎంఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పడాల శ్రీనివాసరెడ్డి, జి.సత్యానందం, భేరి రాంబాబు తదితరులు అభినందించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగిందని విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. విద్యాలయలో ఖాళీ సీట్లకు సుమారు 37 పరీక్ష కేంద్రాల్లో 8,506 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 6,362 మంది హాజరయ్యారని వివరించారు. ఆయా పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి శర్మ చౌదరి, ప్రిన్సిపాల్ కమలం పరిశీలించారు.